మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, ఆర్ఎస్పీ నివాళి

చిరంజీవి పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన స్వేరోస్ సభ్యుడు బల్గూరి దుర్గయ్య సోదరుడు చిరంజీవి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గురువారం చిరంజీవి భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిరంజీవి పాడె మోశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పొట్ట శ్రీవిజయకిరణ్, నడిగూడెం మాజీ జడ్పీటీసీ బాణాల కవితానాగరాజు, నాయకులు ముడియాల వెంకట్‌రెడ్డి, పోశం పూర్ణయ్య, బొర్ర మధు, పిడమర్తి ప్రసాద్, మామిడి రామారావు, వి.వెంకటేశ్వర్లు, వట్టికూటి శ్రీనివాస్, చెరుకూరి కిరణ్, కాసాని రాంబాబు, వట్టికూటి వెంకటేశ్వర్లు, పొట్ట ప్రసాద్, పోశం ఎర్ర కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాళి

సీతారాంరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సీతారాం రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీతారాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అడ్వకేట్ కందుకూరి ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, ఇంజమూరి రాములు తదితరులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పాలకవీడు, ఫిబ్రవరి 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన స్థూపాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని, ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం చేశారని, ప్రైవేటీకరణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఆదాయం లేదంటున్నారని, హామీలు ఇచ్చేటపుడు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు అనంత ప్రకాశ్, ముషం నరసింహ, మట్టేశ్, ధనమూర్తి పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌లో చోరీ

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: మండల పరిధి వైకుంఠాపురం గ్రామ సమీపంలోని సాగర్ కాల్వపై నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.70 వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లినట్లు జల విద్యుత్ కేంద్రం సూపర్‌వైజర్ గుండ్ల వేణుగోపాలరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. కళ్లం బ్రదర్ కాటన్ ప్రైవేట్ ఇండస్ట్రీ పవర్ ప్లాంట్ పేరుతో నిర్వహిస్తున్న జల విద్యుత్ కేంద్రంలో కొంతకాలంగా ఉత్పత్తి నిలిచిపోయింది. ఇదే కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వేణుగోపాలరెడ్డి గురువారం పవర్ ప్లాంట్ పరిశీలనకు వెళ్లగా జనరేటర్ గది తాళం తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూశారు. 11 కేవీ ఇన్వర్టర్, 150 ఎ.హెచ్, 90 ఎ.హెచ్ బ్యాటరీలతో మొత్తంరూ.70 వేల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి తక్షణమే జల విద్యుత్ కేంద్రం డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన సూచన మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

తుంగతుర్తి, ఫిబ్రవరి 6: బొలెరో వాహనంలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు వద్ద ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 1,200 కిలోల నల్లబెల్లం, 350 కిలోల పటిక పట్టుబడింది. నల్లబెల్లం, పటిక తరలిస్తున్న కర్నాలకుంట తండాకు చెందిన నవనాత్ సాహు, గుగులోతు యాకన్నను అదుపులోకి తీసుకున్నామని, నవీన్ అనే మరోవ్యక్తి పరారయ్యాడని సీఐ తెలిపారు. బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు అప్సర్, అయూబ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా

రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: మండల పరిధి నల్లబండగూడెం శివారులోని 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం సిమెంట్ లారీ బోల్తాపడింది. చిల్లకల్లు సమీపంలోని సిమెంట్ పరిశ్రమ నుంచి సిమెంట్ లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనం పాలేరు వాగుపై కొత్త బ్రిడ్జి వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.. కాగా, లారీ రోడ్డుపై అడ్డంగా పడడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, **BASANI ESWARYA YUGENDRA KUMAR** S/o. **BASANI SAILU ESWARYA** MOTHER NAME : BASANI ESWARYA VENKATAMMA, DOB : IS 18/03/1982 (OLD NAME, FATHER NAME, MOTHER NAME & DATE OF BIRTH) R/O. H.NO.6-3-579, GANDHINAGAR, NEAR YADAVA SANGAM, NALGONDA TOWN & DISTRICT, TELANGANA STATE, I HAVE CHANGE MY NAME AND FATHER NAME AND MOTHER NAME AND DATE OF BIRTH AS **BASANI YUGENDHAR KUMAR S/O. BASANI ESWARAIAH, MOTHER NAME : BASANI VENKATAMMA,** DATE OF BIRTH : 18/03/1984 (NEWNAME AND FATHER, MOTHER NAME & DATE OF BIRTH).

CHANGE OF NAME
★I, V.SREENIVASULU, H.No. 4-80, Appajipeta (V), Appajipet Post, Nalgonda District, Telangana-508 001. Changed My Name from V.SREENIVASULU to VALLAKIRTHY SRINIVASULU, S/o. Vallakirthy Vishnumurthy.
NT-329087

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

క్రీడలతో స్నేహభావం

- ఎస్పీ శరత్ చంద్ర పవార్
- జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

హాలియాలో కబడ్డీ పోటీలను ప్రారంభించి యువకులతో కలిసి ఆడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా, ఫిబ్రవరి 6 : కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల వల్ల గ్రామీణ యువత పోలీసులకు మధ్య స్నేహభావం పెరుగుతుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్, యువ తేజం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను గురువారం హాలియాలో ఎస్పీ ప్రారంభించారు. ఎస్పీ కూడా యువతతో కలిసి కబడ్డీ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి మార్గంలో పయనించి సమాజానికి దోహద పడాలన్నారు. కబడ్డీ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 370 టీమ్‌లు పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్ఐలు గోపాల్‌రావు, ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని ఏవీఎం స్కూల్ గ్రౌండ్‌లో గురువారం యువతకు నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎస్ఐ లచ్చిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

కట్టంగూర్ : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఎస్ఐ మునుగోడు రవీందర్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువతకు నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ ప్రసాద్, ఎంఈవో రవినాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి, విష్ణుకుమార్, మెండె వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

చండూరు/మునుగోడు : చండూరు లోని డాన్‌బోస్కో జూనియర్ కళాశాల, మునుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కబడ్డీ పోటీలను చండూరు సీఐ వెంకటయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, మునుగోడు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ బాలశౌరిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములపల్లి : మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్ ప్రారంభించారు. యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ శేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ వరలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి : మండల కేంద్రంలోని సెవెంత్‌డే స్కూల్‌లో మండల స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జాఫర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు సీఐ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి బహుమతులు అందించారు.

నార్కట్‌పల్లి/చిట్యాల : నార్కట్‌పల్లి జడ్పీఉన్నత పాఠశాల, చిట్యాల లయోలా పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను డీఎస్పీ శివరాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు క్రాంతికుమార్, ఎన్. ధర్మా, ప్రధానోపాధ్యాయుడు రాములు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువతకు నిర్వహించిన కబడ్డీ పోటీలను సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ సైదులు ప్రారంభించారు.

నేరేడుగొమ్ములో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్పీ మౌనిక

చిట్యాలలో క్రీడాకారులతో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు

నల్లగొండలో క్రీడాకారులతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

ఆర్చ్ కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వినతి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ రోడ్డులో గల జేబీ ఆర్చిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొండమల్లేపల్లికి చెందిన బొడిగె శంకర్‌గౌడ్, కుంభం యాదగిరి, బొడిగె గౌతమ్ గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి డాకునాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 20 ఏండ్ల క్రితం రూ.3 లక్షలతో దేవరకొండ ఖిలా ఆకారంలో వెంచర్ యాజమాన్యం ప్రవేశ ద్వారం నిర్మించినట్లు తెలిపారు. దాని పక్క ప్లాట్ యజమాని అదనపు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఆర్చిని జేసీబీతో కూల్చినట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ బాలరాజరెడ్డిని వివరణ కోరగా గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఆర్చిని కూల్చడం సరి కాదని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని కార్యదర్శికి సూచించినట్లు తెలిపారు.

పదిలో ఉత్తమ మార్కులు సాధించి విద్యార్థికి రూ.50వేలు

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 6 : ఈ విద్యా సంవత్సరంలో దేవరకొండ పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో టాప్ మార్కులు సాధించిన వారికి రూ.50వేల నగదుతో పాటు గోల్డ్ మెడల్ అందించనున్నట్లు చంద్రన్న ఫౌండేషన్ సభ్యులు హనుమంతు వెంకటేశ్‌గౌడ్, హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించినట్లు పేర్కొన్నారు.

మంత్రదండం పుస్తకావిష్కరణ

చిట్యాల, ఫిబ్రవరి 6 : ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యాయిని ఉప్పల పద్మ సంపాదకత్వంలో గుండ్రాంపల్లి విద్యార్థులు రచించిన మంత్రదండం కథల సంపుటి పుస్తకాన్ని గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ సాదం అయిలయ్య, ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ పఠాన్ ఎఫ్ ఖాన్, పల్లెర్ల సురేందర్, చెలుకూరి మధు, నాగరాజు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

చిట్యాల, ఫిబ్రవరి 6 : బైక్ అదుపుతప్పి రోడ్డు రేలింగ్‌ను ఢీకొనడంతో యువకుడు మృత్యువాత పడిన ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని వెల్మినేడు వద్ద చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ ప్రాంతంలోని యర్గేరా గ్రామానికి చెందిన హినప్ప రాజు (22) విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవటానికి తన స్నేహితుడు మల్లేశ్‌తో కలిసి ఈ నెల 5న బయల్దేరాడు. మండలంలోని వెల్మినేడు గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హినప్ప రాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

రామలింగేశ్వరుడికి శేషవాహన సేవ

- కొనసాగుతున్న చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

శేషవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు భక్తులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున స్వామివారికి శేషవాహన సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, దీక్షా హోమములు, రుద్రహోమం, బలిహరణ, సరస్వతీ పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిశేకం, మహానివేదన, నీరాజన మంత్రపుష్పం, ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో అర్చన చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దైవ దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈఓ నవీన్ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్

కార్యకర్తను పరామర్శిస్తున్న దస్రూనాయక్

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 6 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తను గురువారం ఆయన పరామర్శించారు. ఆయన వెంట కృష్ణానాయక్, రమేశ్, హన్మంతు, లచ్చు, మంగ్తానాయక్, తాపు నాయక్, లచ్చిరాంనాయక్ ఉన్నారు.

పంబాల, మన్నె కులాలను ఎస్సీ ఏ గ్రూపు నుంచి తొలగించాలి

- బేడ బుడిగ జంగం రాష్ట్ర నాయకుడు ఆంజనేయులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

నకిరేకల్, ఫిబ్రవరి 6 : ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఎస్సీ ఏ గ్రూపులో చేర్చిన పంబాల, మన్నె కులాలను వెంటనే తొలగించాలని బేడ బుడిగ జంగం రాష్ట్ర నాయకుడు పర్వతం ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నకిరేకల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన కులాలతో పాటు అభివృద్ధి చెందిన మాల ఉపకులాలన చేర్చడం దారుణమన్నారు. అభివృద్ధి చెందిన పంబాల, మన్నె కులాలను తొలగించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు కడమంచి వెంకటయ్య, కళ్లెం నరసింహ, వానరాశి నారాయణ, వానరాశి మత్స్యగిరి పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 6: మహిళ హత్య కేసులో నిందితుడు ముజావర్ నూర్ మహ్మద్‌కు జీవితఖైదు విధిస్తూ 2వ అడిషనల్ జిల్లా ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రోజా రమణి గురువారం తీర్పు ఇచ్చారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2014 జూన్ 26న కనగల్ మండలం పర్వతగిరి గ్రామ శివారులోని కల్లు గుడిసెలో గుర్తు తెలియని మహిళ హత్యకు గురైనట్లు వీఆర్ఏ ఫిర్యాదు మేరకు కనగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు చివ్వెంల మండలం వస్త్రంతండాకు చెందిన భూక్యా విజయగా పోలీసులు గుర్తించారు. విజయ భర్తను వదిలి ఒంటరిగా ఉంటుండగా, ఆమెకు బాబు, కూతురు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కర్నూలు జిల్లాకు చెందిన ముజావర్ నూర్ మహ్మద్ సూర్యాపేటలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్న సమయంలో విజయ పరిచయమైంది. అప్పటి నుంచి నిందితుడు ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. కొద్ది రోజుల తర్వాత ఆమెపై అనుమానంతో తరచూ ఆమెతో గొడవపడేవాడు. ఆమెను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్న నూర్ మహ్మద్ పథకం ప్రకారం విజయ కూతురికి దేవరకొండ ఎస్సీ గురుకుల పాఠశాలలో సీటు మాట్లాడదామని నమ్మించి తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో పర్వగిరి శివారులో కల్లు గుడిసెలో మద్యం తాపించి మత్తులోకి జారుకోగానే తలపై బండరాయితో మోది హత్య చేశాడు. ఆమె మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టి పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడైన ముజావర్ నూర్ మహ్మద్‌కు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో సరైన ఆధారాలు కోర్టులో సమర్పించిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డీఎస్పీ రాములునాయక్, సీఐ సుబ్బరామిరెడ్డి, పీపీ అఖిల, ఇప్పటి సీఐ వెంకటయ్య, ఎస్ఐ విష్ణుమూర్తిని ఎస్పీ అభినందించారు.

బంటి కుటుంబానికి రక్షణ కల్పించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

బంటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ , ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేట, ఫిబ్రవరి 6 : ఇటీవల హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ (మాల బంటి) కుటుంబానికి రక్షణ కల్పించి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. గురువారం ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులతో కలిసి మాల బంటి భార్య భార్గవి, తండ్రి భిక్షం, సోదరి శ్వేత, బావ నరేశ్‌ను ఆయన పరామర్శించి మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో కేసు పురోగతిపై అధికారులతో చర్చించారు. కేసు వెనక్కి తీసుకుంటే రూ.2 కోట్లు ఇస్తామని, లేకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితులు చైర్మన్ వెంకటయ్యకు ఫిర్యాదు చేయగా.. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. కేసు పురోగతిని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి ఆయనకు వివరించారు. హత్యలో పాల్గొన్న ఆరుగురిని అరెస్టు చేశామని, మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి రూ.4 లక్షల నష్టపరిహారం చెల్లించామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. అనంతరం కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ బంటి కుటుంబాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవాలని అధికారులకు సూచించారు. చట్ట ప్రకారం నిత్యావసర సరుకులు, తక్షణ సాయం అందించాలన్నారు. పింఛన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఐదెకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా డీవీఎంసీ సమావేశం, ప్రతి నెలాఖరున పౌర హక్కుల దినోత్సవం జరుపాలన్నారు. కమిషన్ సభ్యులు శంకర్, రాంబాబు, ఆర్డీఓ వేణుమాధవ్, ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి లత పాల్గొన్నారు.

'అరుణోదయ' రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 6: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఈ నెల 5న సూర్యాపేటలో జరిగిన విలీన సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా పరకాల నాగన్న, అధ్యక్షుడిగా పి.వేణు, ఉపాధ్యక్షులుగా రాయికృష్ణ, ఉదయగిరి, ఇట్టబోయిన రవి, మల్లయ్య, బతుకుల రాజన్న, బొగ్గరపు వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దాసు, సహాయ కార్యదర్శులుగా ఎడంపాక శ్రీశైలం, చిరంజీవి, కాంచనపల్లి సైదులు, అబ్దుల్, స్వప్న, జక్కంపూడి కొండలరావు, కోశాధికారిగా కుమారస్వామితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వరిలో తల్లికర్ర ఈనితే రెండోసారి యూరియా వేయాలి : డీఏఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నల్లగొండ, ఫిబ్రవరి 6: యాసంగిలో నవంబర్–15 నుంచి డిసెంబర్–20 వరకు మాత్రమే నార్లు పోసుకోవాలని.. అంతకు ముందుగా పోస్తే చలి కారణంగా తల్లి వేరు ఎదుగదని, తర్వాత పోస్తే తల్లి వేరు త్వరగా ఈనుతుందని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. 40 నుంచి 45 రోజుల నారు పోసినప్పటికీ అదే సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు చివరగా దమ్ము చేసినప్పుడు డీఏపీ వేసిన తర్వాత యూరియా వేయకపోవటం వల్ల, పొలంలో అధిక భాస్వరం నిల్వలు ఉన్నా, చలి, చౌడు, నీటి ఎద్దడి, పోషకాల లోపం, యాజమాన్యలోపం వల్ల కూడా తల్లి కర్ర ముందుగా ఈనుతుందని తెలిపారు. ఈ సమస్య నుంచి బయట పడేందుకు 20–25 రోజుల నారు మాత్రమే నాటుకోవాలన్నారు. ఒకవేళ తల్లి కర్ర ఈనటం గమనిస్తే రెండో దఫా యూరియా వేయాలని, ఒక వేళ వేయకుంటే మూడో దఫా వేసేటప్పుడు రెండో దఫాకూడా కలిపి వేయాలని సూచించారు. జింక్ లోపం ఉంటే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పది రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు సీహెచ్ రాజు, వీ శ్రీధర్, రాములమ్మ, ఏఓలు శ్రీనివాస్, కీర్తి పాల్గొన్నారు.

'మహాధర్నాను విజయవంతం చేయాలి'

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 6: కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని సత్య ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, నాయకులు ఐతబోయిన సత్యం, దనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, రణపంగ కృష్ణ, మడ్డి అంజిబాబు, నెమ్మాది అడివయ్య, ఇరుగు రమేశ్, ధనియాకుల శ్రీను పాల్గొన్నారు.

వేపలసింగారంలో క్షయ నిర్ధారణ శిబిరం

మాట్లాడుతున్న వైద్యాధికారి వేణుగోపాల్ నాయక్

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని వేపలసింగారం గ్రామంలో లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 7 ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో 346 మందికి కల్లె పరీక్షలు నిర్వహించడంతో పాటు 70 మందికి సైట్ టీబీ టెస్టు, 107 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులను అందించడంతో పాటు రూ.800 విలువైన పౌష్టికాహార కిట్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, పీహెచ్ఎన్ నూర్జహాన్, సూపర్‌వైజర్ పద్మ, ఎల్‌టీ రమేశ్ పాల్గొన్నారు.

అజొల్లా సాగుకు రైతులు ముందుకు రావాలి : ఎంపీడీఓ

గుంజలూరులో అజొల్లా సాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంతోశ్‌కుమార్

చివ్వెంల, ఫిబ్రవరి 6: అజొల్లా సాగుకు రైతులు ముందుకు రావాలని ఎంపీడీఓ సంతోశ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుంజలూరు గ్రామంలో పెదపోలు జయమ్మ అనే మహిళా రైతు తన ఇంటి ఆవరణలో ఉపాధి హామీ పథకంలో భాగంగా తొట్లు నిర్మించి సాగు చేసిన అజొల్లాను ఎంపీడీఓ గురువారం పరిశీలించి మాట్లాడారు. అజొల్లా పశువులకు దాణాగా, వరి పొలాల్లో కలుపు పుట్టకుండా సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, టీఏ విజయ్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పాలెఅన్నారంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని పాలెఅన్నారం గ్రామ పరిధిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రెవెన్యూ, డీఆర్‌డీఏ అధికారులు గురువారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సోలార్ ప్లాంట్‌కు 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లుగా తెలిపారు. తాసీల్దార్ ధృవకుమార్, ఏపీడీ సురేశ్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐ సీతయ్య, సీసీ స్వరూప పాల్గొన్నారు.

'మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు యువత సిద్ధం కావాలి'

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 6: మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు యువత సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సానబోయిన ఉపేందర్ పిలుపునిచ్చారు. ఏపూరు గ్రామంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ యువతను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మతాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో జుజ్జూరి సతీశ్, షేక్ అఖిల్ పాషా, అవిరె సాయికుమార్, నవిల లింగయ్య, అవిరె అప్పయ్య, నూకల గిరిప్రసాద్‌రెడ్డి, ఎరుకల నాగరాజు, సాయి, లింగయ్య, రవి, మహేశ్, భిక్షం పాల్గొన్నారు.